

రూ.100 కోట్లతో ఏవియేషన్ అకాడెమీ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

రూ.100 కోట్లతో రాజమహేంద్రవరంలో ఫైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు తెలిపారు. మంగళవారం హోటల్ లాహాస్పిన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దీని వల్ల 500 మంది వరకూ ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఏప్రిల్, మే నాటికి 40 మందితో మొదటి బ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు. జార్విస్ ఏవియేషన్ అకాడమి ఫణీంద్ర అరుమిల్లి మాట్లాడుతూ 17 ఏళ్లగా హైదరాబాద్ కేంద్రంగా జార్విస్ సొల్యూషన్స్ నిర్వహిస్తున్నామన్నారు. 800 మంది పని చేస్తున్నారని చెప్పారు. 14 నెలల శిక్షణతో ఫైలెట్లను తీర్చిదిద్దుతామన్నారు. దేశంలో 25 వేల మంది ఫైలెట్ల అవసరం ఉందన్నారు. త్వరలో ఏవియేషన్ యూనివర్శిటీ ఏర్పాటు చేసి కోర్సులు కూడా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఛాంబర్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా పాల్గొన్నారు.

బిపిఎస్

- అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు అవకాశం
- ఎనిమిదేళ్ల తరువాత మళ్లీ నోటిఫికేషన్
- అవగాహనకు అధికారుల సమాయత్తం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అక్రమంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బిపిఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్) పథకాన్ని ప్రవేశపెట్టింది. గత వారంలో పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఈ మేరకు జిఒ 225ను విడుదల చేశారు. 1985 సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి 2025 ఆగస్టు 31లోగా నిర్మించిన అక్రమ కట్టడాలు చట్టబద్ధం చేసుకోవడానికి ఈ జిఒ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిల్లాలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నిడదవోలు, కొవ్వూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. 2017లో టిడిపి ప్రభుత్వ హయాంలో బిపిఎస్ పథకాన్ని ప్రకటించింది. వైసిపి ప్రభుత్వ హయాంలో పట్టణాభివృద్ధిశాఖకు సంబంధించి నిర్మాణదారులకు ఎటువంటి ప్రకటనలు చేయలేదు. అక్రమ కట్టడాలకు భారీ జరిమానా విధించడంతో కొన్నిసార్లు మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ అధికారులు కోర్టులో దావాలు వేసి కనీసం 50శాతం అపరాధ రుసుం విధించి అక్రమ కట్టడాలు క్రమబద్ధీకరించారు. కూటమి ప్రభుత్వం మళ్లీ బిపిఎస్ పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో అక్రమ నిర్మాణదారుల్లో హర్షం కనిపిస్తుంది.



ప్రభుత్వ భూములు, దేవదాయ, నది, వాగు, గట్లుపై ఉన్న భవనాలకు మాత్రం అనుమతులు ఇవ్వబోమని అధికారులు స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణదారులు ఈ స్కీమ్‌లో దరఖాస్తు చేసుకోవాలంటే రిజిస్ట్రర్ సేల్‌డీడ్ పత్రాలు, ఈసీ, మార్కెట్ ధర, ప్లాన్, ఇంటి నిర్మాణం ఫొటో, ఇండెంటిటీ బాండ్‌లను ప్రభుత్వం విడుదల చేసిన వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. భూమి విలువ ఆధారంగా నగదు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న సమయంలో రూ.10వేలు తప్పనిసరిగా చెల్లించాలి. 120 రోజుల్లోగా నిర్మాణదారులు దీనికి దరఖాస్తు చేసుకోవాలని పట్టణాభివృద్ధిశాఖ ప్రకటించింది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చర్యలు చేపట్టారు. రామహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో వందలాదిగా అక్రమ భవనాలు ఇప్పటికే గుర్తించారు. దీంతోపాటుగా ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన గహాలను కూడా గుర్తించే పనిలో ఉన్నారు. 2017లో ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు కారణంగా వందల సంఖ్యలో గహాలు క్రమబద్ధీకరణ జరిగాయి. ప్రస్తుతం ప్రభుత్వమే అక్రమ భవనాలకు క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోవడంతో మొత్తం అటువంటి భవనాలన్నీ క్రమబద్ధీకరణకు నోచుకోనున్నాయి. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ సిటి ప్లానర్ నాయుడు ను వివరణ కోరగా ప్రభుత్వం బీపీఎస్ జీవో విడుదల చేసిందని, ప్రజల్లో విస్తతంగా తీసుకువెళ్తామని, అదే విధంగా అక్రమ భవననిర్మాణదారులకు స్కీమ్ ఉపయోగాలు తెలిపి వారితో వెబ్‌సైట్‌లో నమోదు చేయిస్తామ'ని తెలిపారు.

నేడు అన్నదాత సుఖీభవ : జెసి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో రైతులకు నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమవుతాయని జెసి మేఘస్వరూప్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, మండల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో అర్హులైన 1,14,991 మంది రైతులకు రూ.76.99కోట్లు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ-2వ విడత కింద రూ.57.49 కోట్లు, పిఎం కిసాన్ నిధులు రూ.19.50 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమగ్రంగా నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో, అలాగే ఆర్ఎస్‌కెల్లో ఈ కార్యక్రమాన్ని విస్తతంగా నిర్వహించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ కీర్తి చేకూరి తదితరులు దేవరపల్లి మండలం గౌరిపట్నం ఆర్ఎస్‌కెలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అలాగే గ్రీవెన్స్‌లో అందుతున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద నూతన గృహాలు మంజూరుకు సర్వే చేసి అర్హులను గుర్తించాలన్నారు. సర్వే, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి స్వమిత్వ సర్వేలో పురోగతి సాధించాలన్నారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు సంక్షేమ వసతిగృహాలను సందర్శించాలన్నారు. ఆర్ అండ్ బి అధికారులు హాస్టల్ భవనాల ఫిట్‌నెస్‌పై నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ టి.సీతారామమూర్తి, ఎస్‌డిసి ఎస్.భాస్కర్‌రెడ్డి, డిపిఒ వి.శాంతమణి, డిడిఒ పి.వీణాదేవి, తదితరులు పాల్గొన్నారు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి మఘస్వరూప్

ఆర్ఎంసికి జలసంచాయ్ అవార్డు

ఢిల్లీలో అవార్డు అందుకున్న కమిషనర్ రాహుల్ మీనా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు-2024లో జల్ సంచాయ్-జన్ భాగీదారీ విభాగం కింద రాజమహేంద్రవరం నగరం జాతీయ స్థాయిలో 4వ ర్యాంకును సొంతం చేసుకుంది. ఈ మేరకు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ వేడుకల్లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి చంద్రకాంత్ రఘునాథ్‌పాటిల్ నుంచి కమిషనర్ రాహుల్ మీనా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జల సంరక్షణ పనులకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వంగా ఉందని కమిషనర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ మొత్తం 13,298 నీటి సంరక్షణ పనులు పూర్తి చేసి ఈ ఘనతను సాధించినట్లు వెల్లడించారు. ఈ వార్డుతో పాటు రూ.2 కోట్ల నగదు పురస్కారం లభిస్తుందన్నారు. ఈ ఘనత సాధించడంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాత్ర అభినందనీయమన్నారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, భూగర్భ జలాల పెంపు అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ ఎంవికె.మాధవి, ఎఇ వి.వెంకటేష్ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి నుంచి అవార్డును అందుకుంటున్న కమిషనర్

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ 25వ రాష్ట్ర మహాసభ తిరుపతి నగరంలో డిసెంబర్ 12 ,13, 14 తేదీల్లో జరుగుతుందన్నారు. డిసెంబర్ 12న ర్యాలీ, బహిరంగ సభ ఇందిర మైదానంలో జరుగుతుందన్నారు. వేలాదిగా విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభకు రాష్ట్ర నలుమూలల నుండి 500 మంది ఎంపికైన ప్రతినిధులు పాల్గొంటారాన్నరు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు, విద్యారంగ అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదిన్నర అయినా నేటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. గిరిజన విద్యార్థులకు సమస్యలు పరిష్కరించేందుకు ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన శాఖ మినహా అన్ని శాఖల పనులు చేస్తున్నారని, విద్యారంగాన్ని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. యూనివర్సిటీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని జూనియర్ డిగ్రీ కళాశాల కళాశాలల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను మానుకోవాలన్నారు. ఎయిడెడ్ కాలేజీలను కొనసాగించాలనే హామీని నెరవేర్చాలన్నారు. ప్రశ్నించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై కేసులు బనాయించటం సరికాదన్నారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు నాగచైతన్య, జ్యోతి, కార్తీక్, సౌమ్య, లహరి, సురేష్ నాయకులు అఖిల్, రాజా, సాయి, వినోద్ తదితరులు ఈ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

డాక్టర్ బివిఎల్ఎన్‌కు నివాళి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మున్సిపాలిటీ ఏర్పడి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మొదటి చైర్మన్ డాక్టర్ బివిఎల్ఎన్.రాజుకు పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేశారు. రాంబాబు మాట్లాడుతూ బివిఎల్ఎన్ రాజు సుపరిపాలన అందించారన్నారు. ప్రజలకు ఉచిత వైద్యం అందించారన్నారు. ఈ సేవలకు గుర్తింపుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని కౌన్సిల్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజల సంక్షేమ సంఘం నాయకులు బయ్యే మునీంద్ర, నేలపూడి రత్నాజీ, బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు విద్యార్థులు

ప్రజాశక్తి - చాగల్లు

అండర్-14 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ విజయలక్ష్మి తెలిపారు. గత నెల దేవరపల్లిలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 ఫుట్‌బాల్ ఎంపికల్లో చాగల్లు జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు ఎం.మోహిని, ఆర్.ప్రవల్లిక, ఎస్.పావని, డి.జయదుర్గ, కె.దీపిక, కె.అన్నపూర్ణ రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 19 నుంచి 21వరకూ చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులకు దాత ఎమ్‌డి నఫీస్ ఆర్థిక సాయం అందించారు. విద్యార్థులను హెచ్‌ఎం వి.వాసవి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్య, పరిశోధనల్లో అభివృద్ధి ప్రశంసనీయం

ఆర్ట్స్ కళాశాల పురోగతిపై కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఆర్ట్స్ కళాశాలలో విద్య, పరిశోధనల్లో సాధించిన అభివృద్ధి ప్రశంసనీయమని కలెక్టర్ కీర్తి చేకూరి కొనియాడారు. మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఆర్ట్స్ కళాశాలను ఆమె మంగళవారం సందర్శించారు. కళాశాల అకడమిక్ ప్రగతి, పరిశోధనా వాతావరణం, విద్యార్థుల వినూత్న ఆలోచనలకు అనుకూలంగా ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను సమీక్షించారు. తొలుత ఆర్ట్స్ కళాశాల ప్రారంభ ద్వారం, ఇంక్యూబేషన్, ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్షిప్ బ్లాక్‌ను సందర్శించారు. విద్యార్థులు అభివృద్ధి చేసిన ప్రాజెక్టులు, స్టార్టప్ ఆలోచనలు, ఇన్నోవేటివ్ నమూనాలను పరిశీలించారు. అనంతరం అరకు కాఫీ హబ్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రాసెసింగ్, బ్రూయింగ్ విధానాలను ఆరా తీసి ప్రశంసించారు. తరువాత డాక్టర్ సి.వి.రమన్ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం, నానో టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబ్‌లను పరిశీలించారు. క్యాంపస్‌లోని లైబ్రరీని సందర్శించిన కలెక్టర్ మార్క్స్ , డార్విన్ మరియు న్యూటన్ పుస్తకాల సేకరణలు తిలకించారు. 'ఇక్కడ సమయం గడపడం చాలా సంతోషంగా ఉందని' అక్కడ సందర్శకుల పుస్తకంలో కలెక్టర్ స్వయంగా రాశారు. ఆమె వెంట ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు, ఎన్ఆర్‌సి కో-ఆర్డినేటర్ డాక్టర్ సంజీవ్, ఎన్‌సిసి కో-ఆర్డినేటర్ డాక్టర్ యూసుఫ్ బాషా, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వరి, రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్ రవితేజ, పిఆర్ఒ డాక్టర్ జల్ల సురేష్, హెచ్ఒడిలు ఉన్నారు.



కళాశాలను సందర్శిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

రాజమహేంద్రరం సిటీ సీతంపేట గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా భారత వికాస్ పరిషత్ పూర్వ అధ్యక్షులు పివిఎస్.కృష్ణారావు హాజరయ్యారు. గ్రంథాలయ అధికారి వెంకటరమణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు భీమయ్య, డాక్టర్ కష్ణ శర్మ పాల్గొన్నారు . టౌన్ హై స్కూల్ శ్రీ నన్నయ్య మున్సిపల్ హై స్కూల్, ప్రగతి హై స్కూల్, పంతం సత్యనారాయణ స్కూల్ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మెంబర్ పద్మజ సందర్శించారు. చిత్రలేఖనం పోటీలను పరిశీలించారు.

దేవరపల్లి : యర్నగూడెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంఎల్ఎ మద్దిపాటు వెంకట్రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ యర్నగూడెం గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తకాల కోసం రూ.10 వేలను విరాళంగా అందించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు ఆండ్రు అనిల్, నాయకులు బి.విజయభాస్కర్, గద్దె శ్రీనివాస్, మండ సుబ్బారావు, బొల్లిన వెంకటేశ్వరరావు, బిజెపి, జనసేన నాయకులు, అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రతాప్ కుమార్, లైబ్రేరియన్ జి.అనిత ఉన్నారు

నల్లజర్ల : నల్లజర్లలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 120 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రంథాలయం అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు గొట్టిపాటి శ్రీరామమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయాల సందర్శనను ప్రతి విద్యార్థీ దిన చర్యగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎవి.రమణ, జడ్‌పి హైస్కూల్, భాష్యం స్కూల్, ఎకెఆర్‌జి స్కూల్, శశి స్కూల్, శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు : చంద్రవరం శాఖ గ్రంథాలయంలో ఎంపియుపి హెచ్‌ఎం జి.శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 'డిజిటల్ లైబ్రరీ ఉపయోగాలు' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.గోపి, స్కూల్ అసిస్టెంట్ ఎ.మధుకుమార్ పాల్గొన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. మంచి విషయాలకు మాత్రమే వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సెక్రటరీ కాసాని వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది కె.ప్రదీప్‌కుమార్, ఫణి గోపాలకృష్ణ, పాఠకులు పాల్గొన్నారు. విద్యార్థులకు దేశభక్తి గీతాలు, పద్యాల పోటీలు నిర్వహించారు.



నల్లజర్లలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనుమతులు లేని పడవలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - సీతానగరం

అనుమతులు లేకుండా పడవలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. వంగళపూడి గ్రామానికి చెందిన సంగాని స్వామి అనే వ్యక్తి నాటు పడవలపై ప్రయాణికులను తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా సుమారు 30 మంది ప్రయాణికులను ఎక్కించుకుని వంగలపూడి నుంచి పట్టిసీమ తీసుకువెళ్తున్న సమయంలో పోలవరం పోలీసులు ఆపారు. అనుమతులు లేని కారణంగా బోటును సీజ్ చేసి, సంగాని స్వామిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని సీతానగరం తహశీల్దార్ కోర్టులో హాజరుపరిచారు. రూ.2 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో బైండోవర్ చేయించారు. అనంతరం ఎస్ఐ రామ్‌కుమార్ మాట్లాడుతూ అనుమతులు లేని బోట్లను గోదావరిలో తిప్పకూడదన్నారు.

మానవత్వం చాటుకున్న ఎంఎల్ఎ మద్దిపాటి

ప్రజాశక్తి-నల్లజర్ల

ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు మరో మారు తన మానవత్వాన్ని చాటుకున్నారు. చావు బతుకుల మధ్య ఉన్న బాధితునికి ఆర్థిక సాయం అందించి ఊపిరి పోశారు. నల్లజర్ల మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన అనిశెట్టి రాంబాబు తలకు రోడ్డు ప్రమాదంలో బలమైన గాయమైంది. మెదడులో తీవ్ర రక్తస్రావం కావడంతో అత్యవసర వైద్యం నిమిత్తం రాజమండ్రి లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అర్జెంటుగా రూ.50వేలు కట్టాలని హాస్పిటల్ సిబ్బంది చెప్పారు. రెక్కాడితేనే డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో రాంబాబు కుటుంబం దిగాలుపడింది. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ వెంకట్రాజు వైద్యులతో మాట్లాడి ఫోన్ పే ద్వారా రూ.50వేలు కట్టారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రతీ రోజు స్వయంగా రాంబాబు వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరు రోజుల నుంచి వైద్యం పొందుతూ. అపస్మారక స్థితిలో ఉన్న రాంబాబు మంగళవారం స్పృహలోకి వచ్చారు. అతనితో ఎంఎల్ఎ మాట్లాడారు. అంతా తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. తన ప్రాణాన్ని కాపాడిన వైద్యులకు, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు రాంబాబు ధన్యవాదాలు తెలియజేశారు.



ఫోన్‌లో ఎంఎల్ఎతో మాట్లాడుతున్న బాధితుడు

మట్టిగుట్టలు తొలగింపునకు చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన


ప్రజాశక్తి -గోపాలపురం

రోడ్డు వెంబడి వేసిన డ్రెయిన్ మట్టి తరలింపునకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు. 'మట్టిగుట్టలు తొలగించాలి' శీర్షికన మంగళవారం 'ప్రజాశక్తి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందించారు. మంగళవారం రోడ్డు వెంబడి వేసిన మట్టి గుట్టలను తరలిస్తున్నట్లు ఇరిగేషన్ డిఇఇ జి.మనోజ్ కుమార్, ఎఇఇ రాహుల్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ముంథా తుపాను వల్ల పొలాలు ముంపునకు గురవ్వకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కొవ్వూరుపాడు లోని అమ్మ చెరువు నుంచి గంగోలు లోని బాలింక చెరువుకు సుమారు 6 కిలోమీటర్లు వరకు డ్రెయిన్‌లో పూడికలు తీశామన్నారు. ఆ మట్టిని రోడ్డు వెంబడి వేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని, ప్రమాదకరంగా ఉందని తమ దృష్టికి రావడంతో తొలగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.



యంత్రాలతో మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

కార్టూ'నిజం'



ఎఎంఆర్‌తో ముప్పు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఎఎంఆర్) ప్రస్తుతం ఒక తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మారుతోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఈ మేరకు నిర్వహించిన అవగాహనా ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పరిశుభ్రత లోపించడం, స్వేచ్ఛగా మందులు వాడటం, అవసరం లేకున్నా యాంటీ బయోటిక్స్‌ను తీసుకోవాడం ఎఎంఆర్ పెరగడానికి ప్రధాన కారణమన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఎన్‌సిడి స్క్రీనింగ్, పూర్తి టీకాలు, వెక్టర్ వ్యాధుల నియంత్రణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, శుభ్రమైన నీరు, పరిసరాల పరిశుభ్రత వంటి చర్యలు ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో కీలకమన్నారు. వైద్యులు సూచించినప్పుడు మాత్రమే మందులు వాడాలన్నారు. యాంటీబయోటిక్స్‌ను స్వయంగా తీసుకోవడం, ఇంట్లో మిగిలిపోయిన మందులతో చికిత్స చేయడం, అనధికార వనరుల నుంచి మందులు కొనడం తగదన్నారు. డాక్టర్ ఇచ్చిన కోర్సును మధ్యలో ఆపడం వంటి చర్యలను పూర్తిగా నివారించాలన్నారు. యాంటీబయోటిక్ కోర్స్‌ను పూర్తిగా పూర్తి చేయడం అత్యంత కీలకమన్నారు. ఎఎంఆర్ పెరిగితే ఇన్ఫెక్షన్లు తీవ్రమవుతాయన్నారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఉండ్రాజవరం : వైద్యుల సూచన లేకుండా మితిమీరిన యాంటీబయోటిక్స్ వాడటం వల్ల అనర్థాలకు గురవుతారని పిహెచ్‌సి వైద్యాధికారి పి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఈ దుష్ఫలితాలను ప్రజలకు వివరించేందుకు ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పిహెచ్‌సిలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అనారోగ్యానికి గురైతే వైద్యుల సూచనల మేరకే యాంటీ బయోటిక్స్ వాడాలన్నారు. ఎన్ని రోజులు సూచిస్తే అన్ని రోజులూ పూర్తి కోర్సు వాడాలన్నారు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా వాడదరాన్నారు. ఇలా వాడితే కొన్ని సార్లు ప్రాణాలకే ప్రమాదమన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్ కుమారి, ఎంపిహెచ్ఎస్ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ

కుమార్తెపై తండ్రి అఘాయిత్యం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో పిట్టల వేమవరంలో కుమార్తెపై తండ్రి అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పిట్టల వేమవరంలో ముగ్గురు కుమార్తెలతో భార్యాభర్తలు ఉంటున్నారు. బాలికల తల్లి తణుకు బైపాస్ రోడ్డులో ఉన్న దేవి సీఫుడ్ రొయ్యల ఫ్యాక్టరీలో పనికి వెళ్తుంది. తండ్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. వారి పెద్ద కుమార్తె ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. బాలికపై తండ్రి అత్యాచారం చేశాడు. ఇది తెలుసుకున్న తల్లి భర్తను నిలదీసింది. ఈ విషయంలో వారి మధ్య మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆమె కుమార్తెను తీసుకుని పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. బంధువుల సూచనల మేరకు ఆమె పెనుమంట్ర పోలీసులను ఆశ్రయించింది. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును పెరవలి స్టేషన్‌కు బదిలీ చేశారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు మంగళవారం కొవ్వూరు డిఎస్‌పి దేవకుమార్, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు గ్రామానికి వచ్చి కేసు దర్యాప్తు చేశారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేరాలు ఘోరాలు

మున్సిపల్ చైర్‌పర్సన్ మొబైల్ హ్యాక్ రూ.3.40 లక్షల చోరీ

ప్రజాశక్తి - తుని

తుని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భవనసుందరి మొబైల్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి రూ.3.40 లక్షలను చోరీ చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన వాట్సాప్‌ని హ్యాక్ చేసి తన యుపిఐ పని చేయట్లేదని డబ్బులు అవసరమని తాను చాటింగ్ చేసినట్లుగా సైబర్ నేరగాళ్లు చాటింగ్ చేశారని అన్నారు. దీంతో తన బంధువులు, స్నేహితులు డబ్బులు వేయగా రెండు గంటల వ్యవధిలో రూ.3.40 లక్షలను స్వాహా చేశారని తెలిపారు.

ప్రాణం తీసిన కళాశాల బస్సు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మామిడాడ వద్ద బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ప్రయివేటు కళాశాల బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన సాయి (27) మామిడాడ గ్రామ శివారున ఇటుక బట్టి నిర్వహిస్తున్నాడు. సరుకులు తెచ్చుకునేందుకు మంగళవారం ఉదయాన్నే బైక్‌పై బయలు దేరాడు. కొంచెం దూరం వెళ్ళేసరికి ప్రయివేటు కళాశాలకు చెదిన బస్సు అతివేగంతో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్పారు. మృతునికి రెండేళ్ల క్రితం వివాహం కాగా, మూడు రోజుల క్రితం పాప జన్మించింది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. హెచ్‌సి మాణిక్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గండేపల్లి మండలం జెడ్.రాగంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

మోసం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. రౌతులపూడికి చెందిన గెడ్డం లోవప్రసాద్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకొని అనంతరం పెళ్లికి నిరాకరించాడు. ఈ నెల 7వ తేదీన సంబంధిత యువతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో లోవప్రసాదును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

ప్రజాశక్తి - సీతానగరం

అదృశ్యమైన వంగళపూడి గ్రామానికి చెందిన బాలికను పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. తన కుమార్తె అదృశ్యమైందని బాలిక తండ్రి యాళ్ల వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక నాగంపల్లిలో ఉన్నట్టు గుర్తించారు. చదువులో వెనుకబడటంతో తల్లిదండ్రులు మందలించారని, దీంతో బాలిక చుట్టాల ఇంటికి వెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

పోక్సో కేసులో నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలో ఇటీవల నమోదైన పోక్సో కేసులో నిందితుడు గడుసుల నాగవెంకటేష్‌ను నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ అరెస్ట్ చేశారు. నిందితుడిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించిందని సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. బాలికలు, మహిళలతో గౌరవప్రదంగా వ్యవహరించాలని యువకులకు సూచించారు. లేకుంటే కేసుల్లో చిక్కుకుంటారని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తపేట

అమలాపురం వెళ్లే ప్రధాన పంట కాలువలో కొత్తపేట పరిధిలోని గోగివారిపేట సమీపంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు. సుమారు 40- 45 సంవత్సరాలు వయసు కలిగిన పురుషుడి మృతదేహం కొట్టుకు వచ్చినట్లు చెప్పారు. అతని కుడి చేతిపై అనంత పవన్‌కుమార్ అని పచ్చబొట్టు ఉందన్నారు. చనిపోయిన వ్యక్తి శరీరంపై నీలం రంగుపై బిస్కెట్ కలర్ గళ్ల చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ప్రస్తుతం మృతదేహం కొత్తపేట ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉందన్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసినవారు కొత్తపేట ఎస్ఐ సెల్ నెంబర్ 9440904842, రావులపాలెం రూరల్ సిఐ నెంబర్ 9440796527కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్యాస్ డెలివరీ బాయ్‌కి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - పిఠాపురం రోడ్డులోని బ్రౌన్ పేట సెంటర్ వద్ద మంగళవారం రెండు లారీల మధ్య గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న బైక్ చిక్కుకుంది. ఈ ప్రమాదంలో గ్యాస్ డెలివరీ బాయ్‌కి త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఎదురెదురుగా వస్తున్న లారీలు బైకును ఢీకొట్టడంతో గ్యాస్ సిలిండర్‌లు సరఫరా చేసే గంటా శివ పల్టీ కొట్టారు. ప్రమాదంలో బైక్ ధ్వంసం కాగా, శివ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో గ్యాస్ సిలిండర్లు కిందకు పడిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొవ్వూరు

మండలంలోని దేచెర్ల గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే డ్రెయినేజీ పనులకు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. పిఎంజిఐ నిధులతో ఈ పనులను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన తెలగరెడ్డి రామకృష్ణకు మంజూరైన సిఎంరిలీఫ్ ఫండ్ రూ.33,332 చెక్కును ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కాకర్ల నారాయుడు, కోమటి కృష్ణంరాజు, సర్పంచ్ గోశాల నాగార్జున, మాజీ ఎంపిపి పికె.రంగారావు, కొప్పాక విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'కు దూరంగా ఉండాలి : విసి

ప్రజాశక్తి - రాజానగరం



ప్రతిజ్ఞ చేస్తున్న విసి, అడిషనల్‌ఎస్‌పి, విద్యార్థులు

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని నన్నయ యూనివర్శిటీ విసి ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. మంగళవారం జిల్లా వద్దులు వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'నష ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విసి హాజరయ్యారు. జెండా ఊపి అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కేంద్ర పరిపాలన భవనం ప్రాంగణంలో నషా ముక్త్ భారత అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. సెమినార్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విసి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిస కారాదన్నారు. డ్రగ్స్ వల్ల జీవితాలు నాశన మవుతాయన్నారు. అడిషనల్ ఎస్‌పి మురళీధర్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కెవి.స్వామి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఎన్.ఉదయభాస్కర్, పిసిసి డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్ వైద్యులు సుందర్‌రాజు, డిఎస్‌పి, సిఐ, తదితరులు పాల్గొన్నారు.

ఒఎన్‌జిసి నష్ట పరిహారం విడుదల

ప్రజాశక్తి - తాళ్లరేవు


ఎంపి, ఎంఎల్‌ఎలకు కృతజ్ఞత చెబుతున్న స్థానికులు

గతంలో కొందరు లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న ఒఎన్‌జిసి నష్ట పరిహారాన్ని ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు పెద వలసల గ్రామానికి చెందిన 343 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.63,250 చొప్పున రూ.2,16,94,750లను ఆయా బ్యాంక్ ఖాతాలో జమ అయినట్లు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో పలువురు టిడిపి నాయకులు, లబ్ధిదారులు మాట్లాడారు. పరిహారం విడుదల చేయించిన ఎంపి హరీష్ మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ, గ్రామ కమిటీ అధ్యక్షులు సంగాడి కామేశ్వరరావు, కామాడి మాతరాజు, లంకె నూకరాజు, మల్లాడి ధర్మారావు, ఈశ్వరరావు, గంగ సూర్యనారాయణ, వీరబాబు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఎల్‌సి గోపిమూర్తి

ప్రజాశక్తి - రౌతులపూడి


ఎంఎల్‌సి గోపిమూర్తికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

మండలంలోని పలు పాఠశాలలను ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి పరిశీలించారు. మంగళ వారం మండల పర్యటనకు వచ్చిన ఆయనకు యుటిఎఫ్ అధ్యక్షులు కొరుప్రోలు హరిబాబు, నాయకులు పైల రమేష్, బీర తాతబాబు, నాగరాజు తదితరులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. హెచ్‌ఎం కోళ్ల రాంబాబుతో మాట్లాడారు. ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు తప్పడం లేదని హెచ్‌ఎం ఆయనకు వివరించారు. డిఇఒ దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటానని ఎంఎల్‌సి హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సమస్యలను శాసనమండలి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు ఉన్నారు.

సమస్యలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని రాఘవేంద్రపురం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని పటవల పంచాయతీ రాఘవేంద్రపురం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ జనరల్ బాడీ సమావేశం దోనం సునీత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద నుంచి వాటర్ ట్యాంకు స్థలం వరకు గల మురుగు కాలువను శుభ్రం చేయించాలన్నారు. మురుగునీరు, చెత్తాచెదారం ముళ్ళ కంపలతో ఉండడంతో ప్రజలకు రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. దళితులు నివసిస్తున్న ప్రాంతంలో సిసి రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేయాలని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశార. ఈ సమావేశంలో సంఘం గ్రామ కమిటీ నాయకులు తాడి నాగేశ్వరరావు, దోణం మాలయ్య, బీర బాలయోగి, తాడి రాజేష్, కుంచే సత్యవతి, కలవల మంగ, రాయుడు నాగమణి, బొడ్డు నాగమణి, మూర నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కోటనందూరు

పట్టణంలోని పలు ప్రయివేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లపై వైద్య శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీలక్ష్మి జనరల్ హాస్పిటల్, అంకారెడ్డి డెంటల్ హాస్పిటల్, దుర్గాప్రసాద్ డయాబెటికల్ మెడికల్ సెంటర్, రవితేజ లేబోరేటరీ, లీల నర్సింగ్ హోమ్, సురేష్ హాస్పటల్స్‌ను పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర పత్రాలను తనిఖీ చేశారు. ఆసుపత్రుల యాజమాన్యాలు రెన్యువల్ చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై డిఎంహెచ్ఒ నరసింహ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు. సకాలంలో రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోకపోతే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న జ్యోతి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్ మాట్లాడుతూ అన్ని ఆసుపత్రులలో ధరల పట్టిక, సేవలు, డాక్టర్ల వివరాలను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు.


వన సమారాధనలకు వెళ్తున్న మహిళలు

హరిహర క్షేత్రంలో అన్న సమారాధన

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక హరిహర క్షేత్రంలో మంగళవారం 17వ భారీ అన్న సమారాధనను ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయ కమిటీ ప్రతి ఏటా మాస శివరాత్రి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ, మాజీ చైర్మన్ పల్ల సత్యనారాయణమూర్తి, గ్రామ పెద్దలు, నర్సరీ రైతులు, భక్తుల సహకారంతో నిర్వహించిన అన్న సమారాధనలో సుమారు 30 వేలు మంది పాల్గొన్నారు. రద్దీ దష్ట్యా జాతీయ రహదారి పరిసరాల్లో ఎలాంటి ప్రమాద సమస్యలు తలెత్తకుండా కడియం సిఐ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - కడియం

కడియం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శులకు 'పచ్చదనం పరిశుభ్రత'పై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ కె.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ గుల్ల విన్నిబాబు, బండారు తాతారావు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే, డ్రైయిన్లను క్రమ పద్ధతిలో శుభ్రం చేయడంతో పాటు చెత్త సేకరణ సక్రమంగా ఉండాలన్నారు. ప్రజలకు తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉల్లిపాయ తొక్కలు, కోడి గుడ్డు పెంకులు వంటివి మొక్కలకు పోషకాలు అందిస్తాయన్నారు. పచ్చదనం పరిశుభ్రత కొరకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఇఒపిఆర్‌డి నీలం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వన సమారాధనలతో ఒత్తిడి దూరం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వన సమారాధనలు, ఇండస్ట్రియల్ టూర్లు వంటి వాటితో విద్యార్థులు ఒత్తిడికి దూరమవుతారని సత్యవాడ పిఎం శ్రీ ఎస్ఐఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.సూర్యకాంతం అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి, మానసిక వికాసం పెరుగుతుందన్నారు. కార్తీక మాసం చివరి రోజులు, పరీక్షలు ముగిసిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథం, కాశీ విశ్వేశ్వరరావు, పీడీ ప్రవీణ్, రామకృష్ణంరాజు, పోతురాజు, విజయశ్రీ, రామారావు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ పర్యటన వాయిదా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

మానవ వనరులు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన వాయిదా పడింది. ఈ నెల 20న జిల్లాలో ఆయన పర్యటించాల్సి ఉంది. అయితే అదే రోజున బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ కార్యక్రమానికి సిఎం చంద్రబాబుతో పాటూ మంత్రి లోకేష్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో జరగాల్సిన పర్యటన వాయిదా పడింది.

సంక్షేమంతో పాటూ అభివృద్ధి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కూటమి ప్రభుత్వం ఓవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు అభివృద్ధి కూడా పరుగులు పెట్టేలా వివిధ కార్యక్రమాలు చేపట్టిందని కె.సావరం ఎంపిటిసి సభ్యులు కాకర్ల కరుణాకర్ అన్నారు. టీచర్స్ కాలనీ ఏర్పడి మూడు దశాబ్దాలు గడిచినప్పటికీ ఇంత వరకు సిసి రోడ్‌లు వేయకపోవడం విచారకరమన్నారు. కూటమి హయాంలో సిసి రోడ్లను నిర్మిస్తున్నారన్నారు. టీచర్స్ కాలనీలో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. నాణ్యతలో ఎక్కడా లోపం లేకుండా సిసి రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. పంచాయతీరాజ్ ఎఇ ఎన్.ఏడుకొండలు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామాలకు గాను మొత్తం 48 రోడ్డు నిర్మాణ పనులను ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.3.76కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. 5.2 కిలోమీటర్ల మేర సిసి రోడ్ల నిర్మాణం, మెటల్‌తో పుంత రోడ్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు.

సమాజ సేవను పెంపొందించాలి

ప్రజాశక్తి-నల్లజర్ల

విద్యార్థుల్లో సమాజ సేవను పెంపొందించాలని ప్రకాష్‌రావు పాలెం వైస్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎఎస్.ప్రసాద్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులపాటు ప్రకాశరావుపాలెం, ఆవుపాడు, నల్లజర్ల, తెలికచర్ల, సింగరాజుపాలెం గ్రామాల్లో సేవా శిబిరాలను నిర్వహించారు. మూడో రోజు మంగళవారం నల్లజర్ల, ప్రకాశరావుపాలెం గ్రామాల్లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహనా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బాటసారులకు, దుకాణదారులకు, ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం నల్లజర్ల ఎఎస్ఐ ఎం.మోహన్, వై.రాంబాబును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అరవింద్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నన్నయలో నూతన భవనాల పరిశీలన

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన ఇంజినీరింగ్ భవనం, ఎగ్జామినేషన్స్ భవనం, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనాలను కలెక్టర్ కీర్తి చేకూరి, విసి ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం పరిశీలించారు. రూ.20.05 కోట్లతో యూనివర్సిటీ కాలేజ్ ఇంజినీరింగ్ భవనం, రూ.8.25 కోట్లతో ఎగ్జామినేషన్స్ భవనం, రూ.5.50 కోట్లతో స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనం, రూ.11.10 కోట్లతో బాయ్స్ హాస్టల్ భవనాన్ని నిర్మిస్తున్నట్టు విసి తెలిపారు. వారి వెంట రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి ఉన్నారు.




ప్రమాదకరంగా స్తంభానికి వేసిన షోల్డర్లు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-గోపాలపురం

రోడ్లకు ఆనుకుని వేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. కరిచర్లగూడెం గ్రామస్తులు, ప్రయాణికులు మాట్లాడుతూ ఇటీవల విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలకు కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా జగన్నాధపురం సబ్ స్టేషన్ పరిధిలో కరిచర్లగూడెం నుంచి సంజీవపురం వరకు విద్యుత్ స్తంభాలు వేశారన్నారు. ఇంకా విద్యుత్ తీగలు వేయాల్సి ఉందన్నారు. విద్యుత్ స్తంభాలకు వేసిన షోల్డర్ రోడ్లపైకి మీటరు వరకూ వచ్చాయన్నారు. బస్సులు, ఇతర వాహనాలు వెళ్తే ఇవి తగిలి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. పెను ప్రమాదం సంభవించకముందే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.